# గందరగోళం మధ్య వాయిదా పడిన కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం





కామారెడ్డి, బతుకమ్మ :కామారెడ్డి మున్సిపల్ సర్వసభ్య సమావేశం గందరగోళ పరిస్థితుల మధ్య ఎలాంటి అభివృద్ధి అంశాలపై చర్చలు జరగకుండానే వాయిదా పడింది. సమావేశంలో ఎజెండా అంశాలపై అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య విభేదాలు తలెత్తడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చి నట్లు సమాచారం. ఈ సందర్భంగా బీజేపీ కౌన్సిలర్లు మాట్లాడుతూ, మున్సిపల్ సర్వసభ్య సమావేశానికి కొన్ని రోజుల ముందు అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లీడర్లతో నిర్వహించిన సమావేశంలో శానిటేషన్, రోడ్ల మరమ్మత్తులు, డ్రైనేజీ సమస్యలు వంటి ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలనే ఎజెండా లో చేర్చాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. అయితే, ఆ నిర్ణయానికి విరుద్ధంగా మళ్లీ వివిధ బిల్లులకు సంబంధించిన అంశాలను ఎజెండాలో చేర్చారని ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ డిసెంట్ నోటీసు కూడా ఇచ్చినట్లు బీజేపీ సభ్యులు వెల్లడించారు. సర్వసభ్య సమావేశం ప్రారంభమైన అనంతరం శానిటేషన్, చెత్త సేకరణ ట్రాక్టర్ల నిర్వహణ వంటి ప్రజా సమస్యలపై ముందుగా చర్చించాలని బీజేపీ కౌన్సిలర్లు పట్టుబట్టారు. దీంతో సమావేశాన్ని తొలుత 15 నిమిషాల పాటు వాయిదా వేయగా, అనంతరం మధ్యాహ్న భోజన విరామం తర్వాత తిరిగి సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. చివరకు సాయంత్రం 4.40 గంటలకు సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకటించినట్లు బీజేపీ సభ్యులు తెలిపారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయకుండా కాపాడటమే తమ లక్ష్యమని, ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యం ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నామని బీజేపీ కౌన్సిలర్లు పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై మున్సిపల్ చైర్మన్ లేదా అధికారుల నుంచి అధికారిక స్పందన వెలువడాల్సి ఉంది.

# దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారు

## బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు

కామారెడ్డి, బతుకమ్మ :దేశ వ్యతిరేక శక్తులు దేశంలో అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని కామారెడ్డి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు ఆరోపించారు. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్ స్టాండ్ వద్ద కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ప్రధాని నివాసాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ పార్టీ చేపట్టిన కార్యక్రమాన్ని నిరసిస్తూ ఈ ఆందోళన చేపట్టినట్లు బీజేపీ నాయకులు తెలిపారు. దిష్టిబొమ్మ దహనం సందర్భంగా పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించినప్పటికీ, బీజేపీ కార్యకర్తలు నిరసన కొనసాగించి దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు మాట్లాడుతూ, పార్లమెంట్ సమావేశాల్లో దేశ ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులను ఆమోదించే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం పనిచేస్తున్న సమయంలో కాంగ్రెస్ పార్టీ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ప్రధాని నివాసాన్ని ముట్టడించే ప్రయత్నం చేయడం బాధ్యతారాహిత్యమని ఆయన విమర్శించారు. నీట్ పరీక్షల అంశాన్ని కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నాయని ఆయన అన్నారు. ఆర్టికల్ 370 పునరుద్ధరణ, ఆర్ఎస్ఎస్‌పై నిషేధం వంటి అంశాలను ప్రస్తావిస్తూ,



వాటికి నీట్ పరీక్షలతో ఎలాంటి సంబంధం లేదని ప్రశ్నించారు. ప్రస్తుతం దేశం కొత్త దిశగా ముందుకు సాగుతోందని, ఇలాంటి కుట్రలకు బీజేపీ భయపడదని నీలం చిన్న రాజులు పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు ఫలించవని ఆయన అన్నారు. అలాగే కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మరింత పరిణితితో వ్యవహరించాలని సూచిస్తూ విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి వేడుకలు

నిజామాబాద్ అర్బన్, బతుకమ్మ : నగరంలోని దుబ్బ చౌరస్తా వద్ద తిలక్ యూత్ ఆధ్వర్యంలో గురువారం లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిలక్ యూత్ అధ్యక్షుడు తొందూర్ శ్రీనివాస్ మాట్లాడుతూ, “స్వరాజ్యం నా జన్మహక్కు” అనే నినాదంతో భారత స్వాతంత్ర్య ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిన మహనీయుడు లోకమాన్య బాలగంగాధర్ తిలక్ అని కొనియాడారు. తన ఉద్యమాల ద్వారా ఆంగ్లేయులను ఉక్కిరిబిక్కిరి చేసిన ఉద్యమ నాయకుడిగా, గణేష్ నవరాత్రులను ప్రజా ఉద్యమంగా ప్రారంభించి హిందువులందరినీ ఏకం చేసిన జాతీయోద్యమ పితామహుడిగా తిలక్ సేవలను ఆయన స్మరించారు. లోకమాన్య బాలగంగాధర్ తిలక్ జయంతి సందర్భంగా ఆయనకు ఘన నివాళులు అర్పిస్తూ, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ





కార్యక్రమంలో పంచరెడ్డి శ్యామ్, బంటు గణేష్, తొందూర్ అశోక్, బంటు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# సూపర్ బ్రెయిన్ యోగతో చురుకైనా మేధస్సు

## అంతర్జాతీయ గుంజిళ్ళ ప్రచారకులు అందే జీవన్ రావు

హైదరాబాద్, బతుకమ్మ :ప్రతినిత్యం విధిగా సూపర్ బ్రెయిన్ యోగ (గుంజిళ్ళు) చెయ్యడం వల్ల చురుకైనా మేధస్సు లభిస్తుందని అంతర్జాతీయ గుంజిళ్ళ ప్రచారకులు అందె జీవన్ రావు అన్నారు. గురువారం ఆయన కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు, ఎల్ హంకలోని బర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సబ్సిడరీ ట్రైనింగ్ సెంటర్ లో సూపర్ బ్రెయిన్ యోగ పై వర్క్ షాప్ నిర్వహించారు. ఈ మేరకు సైనికులతో 14 రౌండ్లు సూపర్ బ్రెయిన్ యోగ గుంజిళ్ళు చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ బ్రెయిన్ యోగా వలన మెదడు చురుకుదనం పెరిగి జ్ఞాపక శక్తి మెరుగుపడుతుందన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా ప్రతినిత్యం చేయడం వలన అభ్యర్థులలో జ్ఞాపక శక్తి, అభ్యసనం, సృజనాత్మకత, జ్ఞానం, ఏకాగ్రత, గుర్తుంచుకోవడం, సమస్యా పరిష్కారం, శారీరక ధారుడ్యం మొదలైనవి పెంపొంది, సమస్యలు,ఆందోళనల నుండి ఉపశమనం కలుగుతుందని అన్నారు. సూపర్ బ్రెయిన్ యోగా చేసే విధానాన్ని అభ్యర్థులకు వివరించారు.



# తక్కువ వర్షపాతానికి అనుకూల పంటలు సాగు చేయాలి

## వ్యవసాయ అధికారి వీర స్వామి



మోర్తాడ్, బతుకమ్మ:రైతులు మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల వైవిధ్యీకరణను చేపట్టాలని వ్యవసాయ అధికారి వీర స్వామి కోరారు. మోర్తాడ్ మండలంలోని మోర్తాడ్ గ్రామ రైతు వేదికలో గురువారం రైతులకు పంటల వైవిధ్యీకరణ పై అవగాహన సమావేశం నిర్వహించారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉన్నందున ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయ అధికారి వీర స్వామి మాట్లాడుతూ, ప్రస్తుత వానాకాలంలో ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా తక్కువ నీటితో సాగు చేయగల వర్షాధార పంటలైన కందులు, సజ్జలు, మొక్కజొన్న వంటి పంటలను రైతులు ఎంచుకోవాలని సూచించారు. తక్కువ వర్షపాతం పరిస్థితుల్లోనూ ఈ పంటలు మెరుగైన దిగుబడులను అందించే అవకాశం ఉందని, రైతులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరుస్తాయని ఆయన వివరించారు. స్థానిక వాతావరణ పరిస్థితులు, నేల స్వభావం, వ్యవసాయ శాఖ సూచనలను పరిగణనలోకి తీసుకుని పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు సూచించారు. శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా ఉత్పాదకతను పెంచుకోవచ్చని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి హరీష్ కుమార్, జిల్లా హార్టికల్చర్ అధికారి శ్రీనివాస్, మండల హార్టికల్చర్ అధికారి రాజగౌడ్, వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ) శ్రీలత, లకపతి, మహేష్ భార్గవ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

# ఘనంగా పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు



బాన్సువాడ, బతుకమ్మ :రాష్ట్ర వ్యవసాయ సలహాదారులు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తనయుడు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి జన్మదిన వేడుకలు బాన్సువాడ నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాన్సువాడ మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖామర్ సుల్తానా గౌస్ మర్యాదపూర్వకంగా భాస్కర్ రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఖామర్ సుల్తానా గౌస్ మాట్లాడుతూ, ప్రజలతో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న పోచారం భాస్కర్ రెడ్డి ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకుడని కొనియాడారు. ఆయనకు భగవంతుడు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించి, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.అనంతరం పోచారం భాస్కర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని బాన్సువాడ ఏరియా ఆసుపత్రిలో రక్తదాన శిబిరంలో మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు ఖామర్ సుల్తానా గౌస్ పాషా స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రక్తదానం మహాదానం అని, ఒక యూనిట్ రక్తం ఎంతో మంది ప్రాణాలను కాపాడగలదని అన్నారు.

